గ్రామాలకు బీటీరోడ్లు

- రాచాల, తిమ్మాయిపల్లి తండాకు బీటీ రెన్యూవల్
- తీరనున్న కష్టాలు



పూర్తయిన రాచాల బీటీరోడ్డు పనులు

అడ్డాకుల: మండలంలోని పలు గ్రామాలకు రోడ్ల కష్టాలు తీరుతున్నాయి. వర్షాకాలంలో రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతున్నాయి. రెండు గ్రామాలకు బీటీ రెన్యూవల్ పనులు మొదలై పూర్తి కావొస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి కాటవరం మీదుగా తిమ్మాయిపల్లి తండా వరకు ప్రస్తుతం ఉన్న బీటీరోడ్డుపై రెన్యూవల్ కోసం, అదేవిధంగా పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరు కావడంతో పనులు మొదలై పూర్తి కావొస్తున్నాయి. వర్షాకాలం మొదలయ్యే నాటికి రోడ్డు పనులు పూర్తవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాచాల రోడ్డుకు రూ.2.40 కోట్లు..

పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు సుమారు 4.3కిలోమీటర్ల దూరం వరకు బీటీరోడ్డు పూర్తిగా పాడై వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగేది. అందులోనూ జిల్లా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సొంత గ్రామం కావడంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి బీటీ రెన్యూవల్ కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంఆర్‌ఆర్ కింద రూ.2.40కోట్లను మంజూరు చేయించారు. దీంతో మూడు నెలల కిందట పనులు మొదలై నేడో, రేపో పూర్తి కానున్నాయి. ఇందులో 4.3కిలోమీటర్ల దూరం బీటీ రెన్యూవల్‌ను పూర్తి చేయగా గ్రామంలో సుమారు 900 మీటర్ల దూరం సీసీ పనులు చేయించారు. దీనివల్ల రాచాల, దుబ్బపల్లి, నాగాయపల్లి, దేవరకద్ర మండలంలోని ఇస్త్రంపల్లి, కౌకుంట్ల గ్రామాల ప్రజలకు మేలు జరగనుంది.



కాటవరం వద్ద పూర్తయిన బీటీరోడ్డు పనులు

హైవే నుంచి కాటవరం వరకు..

జాతీయ రహదారి నుంచి తిమ్మాయిపల్లి తండా వరకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంఆర్‌ఆర్ కింద బీటీరోడ్డు రెన్యూవల్‌కు రూ.55లక్షలు మంజూరయ్యాయి. హైవే నుంచి తిమ్మాయిపల్లి తండా వరకు సుమారు 4.6కిలోమీటర్ల దూరం ఉంది. అయితే ఇందుకు సరిపడా నిధులు మంజూరు కాకపోవడంతో హైవే నుంచి కాటవరం మీదుగా 1.8కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు పనులను పూర్తి చేశారు. మిగిలిన రోడ్డు పనులకు రూ.2.20లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైతే తండా వరకు రోడ్డు పనులు పూర్తి కానున్నాయి.

అసంపూర్తిగా రెండు రోడ్లు

జాతీయ రహదారి నుంచి గుడిబండ వరకు కొత్త బీటీరోడ్డు పనులు ఫిబ్రవరిలో మొదలైనా నేటికి పూర్తి కావడం లేదు. హైవే నుంచి 1.85కిలోమీటర్ల దూరం కొత్త బీటీరోడ్డు కోసం రూ.1.60లక్షలు మంజూరు కాగా పనులు మొదలై నాలుగు నెలలైంది. అదేవిధంగా తిమ్మాయిపల్లి తండా రోడ్డు నుంచి రాంచంద్రాపూర్ వరకు 1.45కిలోమీటర్ల దూరం కొత్త బీటీరోడ్డు కోసం రూ.కోటి మంజూరై పనులు మొదలై అసంపూర్తిగా ఉన్నాయి. ఇవి పూర్తయితే ఆయా గ్రామాలకు కష్టాలు తీరనున్నాయి.

వారంలో రోజుల్లో ప్రారంభిస్తాం..




రాచాల, తిమ్మాయిపల్లి తండా బీటీరోడ్ల రెన్యూవల్ పనులు దాదాపు పూర్తయియ్యాయి. గుడిబండ, రాంచంద్రాపూర్ కొత్త బీటీరోడ్ల పనులు ఇటీవల నిలిచి పోయాయి. ఆ రోడ్ల పనులను వారం రోజుల్లో మొదలు చేయించి త్వరితగతిన పూర్తి చేయిస్తాం.

– వేణుగోపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ, అడ్డాకుల

అంధకారంలో చెన్నాయిపల్లి

- పదిహేను రోజులుగా వెలగని విద్యుత్ దీపాలు



రాత్రివేళ వెలగని విద్యుత్ దీపం

గండేడ్: విద్యుత్ సరఫరాలో లోపంతో చెన్నాయిపల్లిలో అంధకారం అలుముకుంది. 15 రోజులుగా రాత్రివేళల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. సర్పంచ్ లక్ష్మి విద్యుత్ విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 27న జనరల్ బాడీ సమావేశంలో సైతం విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినా ఇప్పటికీ ఎవరూ స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. సంబంధిత ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మిడ్జిల్: బోయిన్‌పల్లి గేటు వద్ద 167 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన విద్యార్థి మల్లేష్(13) రోడ్డు దాటుతుండగా అటుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో త్రీవంగా గాయపడ్డాడు. గ్రామస్తులు వెంటనే అతడిని 108లో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు పోలీసులు వివరించారు. కాగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మట్టి తరలింపు అడ్డగింత



టిప్పర్‌ను పట్టుకున్న గిర్దావర్ సాహత్ ఇషాన్

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం అడ్డుకున్నారు. శివారులోని గుట్ట నుంచి అనుమతి లేకుండా అదే ప్రాంతంలో వెలిసిన ఓ వెంచర్‌కు ఓ టిప్పర్ ద్వారా మట్టిని తరలిస్తున్నారు. దీంతో గ్రామస్తులు తహసీల్దార్ కిషన్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరక్ గిర్దావర్ సాహత్ ఇషాన్ అక్కడికి వెళ్లి మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: చాకలపల్లి సమీపంలో శనివారం ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డె రాంచంద్రయ్య అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడన్న సమాచారంలో పోలీసులు వెళ్లగా ఆతడు ట్రాక్టర్ వదిలి పారిపోయినట్లు వివరించారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌గా ఉన్న రాంచంద్రయ్యపై కేసునమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన కార్మికులు



దేవరకద్రలో నోటీసు ఇస్తున్న కార్మికులు

దేవరకద్ర: గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం అధికారులకు శనివారం సమ్మె నోటీసును ఇచ్చారు. జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్‌లతో సమ్మె నిర్వహించనున్నట్లు ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు తెలిపారు. ఈ నెల 6 నుంచి సమ్మెలో కార్మికులు, సిబ్బంది సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా కార్మిక నాయకులు బాలు, అంజన్న, మండల నాయకులు వెంకట్‌రాములు, దాసు, సూరయ్య, చాంద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ అనిల్‌కుమార్‌కు శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెనోటీస్ అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు జేఎస్ దేవదానం కార్మికులంతా ఏకమై సమ్మెలో పాల్గొనాలని కోరారు.

బస్టాండ్ ఏర్పాటుకు స్థల పరిశీలన



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో బస్టాండ్ ఏర్పాటు కోసం శనివారం ఆర్టీసీ ఉన్నతాధికారులు అనువైన స్థలాన్ని పరిశీలించారు. హైదరాబాద్ జోన్ ఆర్టీసీ ఈడీ పురుషోత్తం, ఆర్ఎం సుజాత, డీఎం పోచయ్య, లింగం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసింది



జడ్చర్ల డిగ్రీ కళాశాల వద్ద బారులు తీరిన అభ్యర్థులు

సాక్షి నెట్‌వర్క్ : జడ్చర్లలో గ్రూప్4 ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 15 పరీక్ష కేంద్రాలలో 4,638 మంది అభ్యర్థులను కేటాయించారు. పరీక్ష అయిపోగానే సిగ్నల్‌గడ్డపై కొద్దిసేపు ట్రాఫిక్ జాం ఏర్పడింది. సీఐ రమేష్‌బాబు నేతృత్వంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం గ్రూపు–4 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం ఐదు కేంద్రాల్లో 1872 మందికి 1531 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

భూత్పూర్ పట్టణంలో రెండు సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. 552 మందికి గానూ ఉదయం 79 మంది, మధ్యాహ్నం 82 మంది గైర్హాజరైనట్లు తహసీల్దార్ చెన్నకిష్టన్న, ఎంపీడీవో మున్నీ తెలిపారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నవాబుపేట మండల పరిధిలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాన్ని ఎస్పీ నర్సింహ తనిఖీ చేశారు. ఎస్ఐ పురుషోత్తం, ఎంపీడీఓ శ్రీలత, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కేంద్రంలో పెద్దవెలికిచర్ల సర్పంచ్ భూపాలచారీ సైతం పరీక్ష రాశారు.

బాలానగర్ మండల కేంద్రంలో మొత్తం 216 మందికి గానూ 33 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు.



గండేడ్ మండలంలో తనిఖీ చేస్తున్న సిబ్బంది

అభ్యర్థులకు అన్నదానం

గండేడ్: వెన్నాచేడ్‌లో 670 మంది పరీక్ష రాశారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు, వారి వెంట వచ్చిన సహాయకులకు శనివారం డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా భోజనం వడ్డించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండలంలో రెండు కేంద్రాల్లో సుమారు 500 మంది పరీక్ష రాశారు. సర్పంచ్ అనసూయ ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, యూత్ అధ్యక్షుడు మధు, ఉపసర్పంచ్ రాంచంద్రయ్య పాల్గొన్నారు.



నంచర్లలో భోజనం చేస్తున్న అభ్యర్థులు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



మాచన్‌పల్లిలో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మల్లు రజిత

మహబూబ్‌నగర్ రూరల్: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో బ్యాంకు ఉద్యోగి అయిన మల్లు రజితా రాజేష్ కుమార్‌రెడ్డి అన్నారు. తాను చదివిన పాఠశాల విద్యార్థులకు తనవంతు సాయంగా మాచన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రి అందజేశారు. సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఎస్ఎంసీ చైర్మన్ భీమయ్య, ఎం.వెంకట్ రెడ్డి, మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణు, రాజేందర్‌రెడ్డి, మొగులయ్య, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సూగూరుగడ్డ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి

అడ్డాకుల: మండల కేంద్రంలోని మాతృశ్రీ పాఠశాల వద్ద ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ మండల యువత ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నట్లు వివరించారు. మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కందూర్ సర్పంచ్ శ్రీకాంత్, యువత నాయకులు బాలరాజు, మహేష్ యాదవ్, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



నవాబుపేటలో..



ఏరియా ఆస్పత్రి వైద్యులను సత్కరించిన సీనియర్ సిటిజన్‌ఫోరం సభ్యులు

జడ్చర్ల టౌన్: జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వివిధ సంస్థల ఆధ్వరంలో డాక్టర్లను ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి సూరింటెండెంట్ డా.సోమశేఖర్‌తోపాటు వైద్య బృందం హరనాథ్, రాఘవేందర్, సత్యనారాయణ, సూర్య, హర్షతుల్లా, కిరణ్, మాధవి, ప్రశాంతి, సౌజన్య, వంశీకృష్ణలను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు సత్యనారాయణ, కాట్రపల్లి లక్ష్మయ్య, అయ్యన్న పాల్గొన్నారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకురాలు బాలమణి ఆధ్వర్యంలో ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యులు డా.ప్రభాకర్‌రెడ్డి, హోమియో వైద్యులు డా.వెంకట్‌లను సత్కరించారు. ఆర్‌బీఎస్‌కే డా. సునీల్‌కు పూలమాలలు వేసి సత్కరించారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు కాట్రపల్లి లక్ష్మయ్య, హఫీజ్‌ఉర్ రహ్మాన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్లు రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలతోపాటు మరికొందరిని సత్కరించారు.

నవాబుపేట: మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మండల వైద్యాధికారులు విజయలక్ష్మి, తేజశ్రీ, వెంకటేష్‌లను సన్మానించారు. ఫోరం సభ్యులు వెంకటేశ్వరప్ప, అనంతయ్య, వేణునాథం. వైద్య సిబ్బంది రాఘవేందర్, శరబలింగం, భర్మని విజయ్‌కుమార్, చిన్నస్వామి తదితరులు ఉన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్ కాంప్లెక్స్‌లో పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులు శ్రవణ్‌కుమార్, రఘు, రూఫీ, ఓంప్రకాశ్ తదితరులు సన్మానం పొందిన వారిలో ఉన్నారు. ను కార్యక్రమంలో రమేషచందర్, సురేష్‌చందర్, జగదీష్, శ్రీనివాస్, బాలు, సుబాషిణి, గీతారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జానంపేటలో సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అడ్డాకుల: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ కోరారు. మూసాపేట మండలం జానంపేట గ్రామంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, మండల ముఖ్య నాయకులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యున్నతికి అందరు కృషి చేయాలని సూచించారు. అనంతరం గాయకుడు సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మ యాదవ్, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, నాయకులు కొండయ్య, మల్లయ్య, వెంకటయ్య, శేఖర్, రఘుపతిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్చరీ కోచ్‌కు ఘన సన్మానం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్చరీలో ఎన్ఐఎస్ డిప్లొమా శిక్షణకు వెళ్తున్న ఆర్చరీ కోచ్ జ్ఞానేశ్వర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో పలువురు ఘనంగా సన్మానించారు. ఆర్చరీలో మరింత ఉన్నతమైన ఎన్ఐఎస్ శిక్షణకు వెళ్తుండడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి రాంచందర్‌తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

నవాబుపేట: సహకార సంఘాలు మరింతో బలోపేతం కావడానికి చేయూత నిస్తామని చైర్మన్ నర్సింహులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సహకార దినోత్సవం సందర్భంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. రైతులు సంఘాలను వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ గోపాల్‌గౌడ్, సభ్యులు ప్రతాప్, అంజయ్య, సీతఓట హన్మంతు, శ్రీశైలం, నర్సింహ, గిరి పాల్గొన్నారు.

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గండేడ్: పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ విస్తారక్ సంజయ్ ప్రభు శనివారం పేర్కొన్నారు. మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వెన్నాచేడ్ గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ , కార్యదర్శి మల్కయ్య, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బాలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ , బూత్ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నవాబుపేట: కొత్త రేషన్‌కార్డులు కావాల్సిన వారు సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని, పేర్ల మార్పులు, చేర్పులకు సైతం అవకాశం ఉందని అధికారులు వివరించారు. కాగా వీటికి సంబంధించి ఇంకా అధికారికంగా ఉత్తర్వులు అందాల్సి ఉందని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

23న రైతు అవగాహన సదస్సు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 23న ప్రకృతి సేంద్రియ ఎరువుల వ్యవసాయం వాటి పద్ధతులపై గ్రామ భారతి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గ్రామ భారతి జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి గుముడాల చక్రవర్తి గౌడ్ ఈ సందర్భంగ వివరాలు తెలియజేశారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరిచండి

బాలానగర్: మాచారంలోని సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని సర్పంచ్ రమేష్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయనను ప్రత్యేకంగా కలిశారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారని మండల వైస్ ఎంపీపీ వెంకటచారి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోపరేటివ్ చైర్మన్ వాల్యానాయక్, జిల్లా నాయకులు లక్ష్మణ్ నాయక్, రాము, రాజేందర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భూత్పూర్: పట్టణంలోని యునాని డిస్పెన్సరీస్ వారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ యునాని వైద్యశాల ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నేస్ సెంటర్ భూత్పూర్ వైద్యాధికారి డా. జహీరోద్దీన్ వివేకానంద విద్యాలయంలో 51 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రాథమిక కేంద్రం సీహెచ్‌ఓ బొర్రా రామయ్య, కరస్పాండెంట్ సి.నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

బాలానగర్: పెద్దాయపల్లికి చెందిన రైతు వెంకటమ్మ ఎద్దు దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఘటనపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి వచ్చేలా చేశారు. ఈ మేరకు మంజూరైన రూ. లక్ష చెక్కు ను శనివారం సర్పంచ్ శంకరప్ప బాధిత కుటుంబానికి అందజేశారు. తిరుపతి, లింగం, మురళీధర్ రెడ్డి ఉన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని శ్రీనివాస ఆస్పత్రిలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 5 108 ఏ జడ్చర్ల క్లబ్, వనితక్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీనివాస ఆస్పత్రి నిర్వాహకులు డా.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందులు అందించారు. శిబిరానికి హాజరైన వారికి మందులు, పండ్లు, నీళ్లు, బిస్కట్స్‌ను వాసవీక్లబ్ పంపిణీ చేసింది. వాసవీక్లబ్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ, జీపీ ప్రవీణ్, కండె కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, నరేష్, విజయలక్ష్మి, సూర్య పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు దీక్షలు



కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించేవరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని జేఏసీ మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం రిలేదీక్షలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

నవాబుపేట: లింగంపల్లి జెడ్పీ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శనివారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. దాదాపు రూ. 30 లక్షలతో నిర్మించనున్న గదులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కాంట్రాక్టర్‌ను సర్పంచ్ పాండురంగారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఉషరాణీ కోరారు. ఉపసర్పంచ్ పద్మారెడ్డి, పాఠశాల చైర్మన్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు గౌరవ వేతనాలు

జడ్చర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అర్చకులకు గౌరవ వేతనాలు మంజూరు చేసిందని జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. మండలంలోని ఆలయాల ప్రధాన పూజారులకు గౌరవ వేతనాలకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం అందజేశారు. ప్రతి నెల రూ.6వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, రఘుపతిరెడ్డి, రాములు, వెంకట్‌రెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.